**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 09-03-2024** **సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు**

**ముఖ్యాంశాలు**

- **ఈశాన్య ప్రాంతంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
- **మాతృభాషను సులభంగా నేర్చుకున్నవారు ఏ భాషనైనా అవలీలగా నేర్చుకుంటారని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు.**
- **కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం "పీఎం సురాజ్"ను ఈనెల 13న నిర్వహించున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున తెలిపారు.**
- **ఇంగ్లండ్‌తో జరిగిన చివరి క్రికెట్ టెస్టు మ్యాచ్ లో ఈరోజు భారత్ 4-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది.**

**==========**

**"వికసిత్ భారత్ - వికసిత్ నార్త్ ఈస్ట్" కార్యక్రమంలో భాగంగా మణిపూర్, మేఘాలయా, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 55 వేల 600 కోట్ల రూపాయల అభివృద్ధి పనులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. దీనిలో భాగంగా "ఉన్నతి" పథకం కింద కింద సుమారు 10 వేల కోట్ల రూపాయలతో నిర్మించిన సేలా సొరంగ మార్గన్ని ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఈశాన్య ప్రాంతంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి**

చేస్తామని, పారిశ్రామిక అభివృద్ధికి, ఆర్థిక వృద్ధికి ఉన్నతి పథకం ఎంతో దోహదపడుతోందని ప్రధాని పేర్కొంటూ.......

(వాయిస్ 27 సెకన్లు)

==========

తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఈరోజు కాకినాడలో నిర్వహించిన అఖిల భారత తెలుగు సాహితీ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగు భాషా పరిరక్షణకు పత్రికారంగంతో పాటు సినిమా, టెలివిజన్ తో పాటు అందరూ కృషి చేయాలన్నారు. తెలుగు పద్యాల్లో ఉన్న భావన, వైభవం మరే ఇతర భాషల్లో లేదనడం అతిశయోక్తి కాదన్నారు. మాతృభాషను సులభంగా నేర్చుకున్నవారు ఏ భాషనైనా అవలీలగా నేర్చుకుంటారని శాస్త్రవేత్తలే స్వయంగా చెబుతున్నారని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

==========

కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించే క్రమంలో మార్చి 13న "పీఎం సురాజ్" పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున తెలిపారు. దేశవ్యాప్తంగా 510 జిల్లాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టరేట్ లో జిల్లాకు సంబంధించిన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. 13వ తేదీ సాయంకాలం 4 గంటలకు వర్చువల్ గా జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలయ్యే పథకాల పొందుతున్న లబ్దిదారులతో, రుణ గ్రహీతలతో ముఖాముఖి నిర్వహిస్తారని ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రుణ గ్రహీతలకు చెక్కులు కూడా అందజేస్తారని కలెక్టర్ వివరించారు.

==========

తిరుపతి జిల్లాలోని ప్రముఖ వాయులింగ క్షేత్రం శ్రీకాళహస్తిలో రథోత్సవం కన్నుల పండుగగా జరిగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లోనే ప్రధాన ఘట్టమైన రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. శివ నామస్మరణలు చేసుకుంటూ రథాన్ని లాగేందుకు భక్తులు తరలివచ్చారు. శ్రీకాళహస్తి నాలుగు మాడ వీధులు

భక్తులతో నిండిపోయాయి. రథోత్సవం పురస్కరించుకొని పలు స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు అన్నదానాలు, పానీయాలు పంపిణీ వంటి సేవ కార్యక్రమాలు చేపట్టా యి.

విరామం

==========

ప్రతి ఒక్కరు వారి ఓటు హక్కును వినియోగించుకొనేలా కేంద్ర ప్రభుత్వం 'మేరా పహేలా ఓట్ దేశ్ కేలియే' కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించి దేశవ్యాప్తంగా వివిధ కళాశాలు, విశ్వవిద్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని జరుపుతూ కొత్త ఓటర్లకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంకు చెందిన నూతన ఓటరు ప్రవీణ్ కుమార్ ఆకాశవాణితో మాట్లాడారు. తమకు ఓటు హక్కు రావడం ఎంతో సంతోషంగా ఉందని, దేశం అభివృద్ధికి వారి ఓటును ఈ ఎన్నికల్లో ఉపయోగిస్తామని తెలిపారు.
(వాయిస్ 14 సెకన్లు)

==========

ధర్మశాల వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన చివరి క్రికెట్ టెస్టు మ్యాచ్ లో భారత్ ఘన విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇన్నింగ్స్ 64 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ ను భారత్ ఓడించింది. ఈ రోజు 259 పరుగులతో రెండవ ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇంగ్లండ్.. 195 పరుగులకే మొత్తం వికెట్లను కోల్పోయింది. భారత బౌలర్లలో అశ్విన్ 5 వికెట్లు తీయగా, జడేజా, కుల్దీప్ యాదవ్ చెరో  రెండు వికెట్లు తీశారు. అంతకుముందు ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 218 పరుగులు చేయగా, టీమిండియా తొలి ఇన్నింగ్స్ లో 477 పరుగుల భారీ స్కోర్ సాధించింది. రోహిత్ శర్మ 103 పరుగులు, శుభ్‌మాన్ గిల్ 110 పరుగులు చేసారు. దీంతో భారత్‌కు తొలి ఇన్నింగ్స్ లో 259 పరుగుల ఆధిక్యం లభించింది. ఇక వరుసగా నాలుగు టెస్టుల్లో విజయం సాధించిన భారత్.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-1 తేడాతో సొంతం చేసుకుంది.

==========

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ రేపు విజయనగరం జిల్లాలో పర్యటించనున్నారు. చీపురుపల్లి, గరివిడి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారు.  అలాగే 11వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కిమ్మి గ్రామం చేరుకొని నాగావళి నదిపై నిర్మించిన వంతెనతో పాటు, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను

ప్రారంభిస్తారు. అక్కడి నుంచి వంగర మండలం తలగాం చేరుకొని సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ కేంద్ర భవనాలను అలాగే రాత్రి 7 గంటలకు విజయనగరం చేరుకొని నెహ్రూ పార్క్ ను ప్రారంభిస్తారు.

==========

ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర చాలా కీలకమని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, తదితరులకు కలెక్టరేట్ లో ఈరోజు ఎన్నికల నిర్వహణకు సంభందించి పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గానికి ఆర్వో, ఏఆర్వోలను నియమించినట్లు చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించే వరకూ రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.

==========

మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం లభించినప్పుడే పురుషులతో సమానంగా సమాజంలో పైకి ఎదుగుతారని ఒడిశా రాష్ట్రం బెర్హంపూర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గీతాంజలి దాస్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయనగరం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో  ఈ రోజు జరిగిన "వసుధైక కుటుంబం" అనే అంశంపై నిర్వహించిన కార్యశాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

==========

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పుట్టపర్తి శాసనసభ్యులు శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ రోజు బుక్కపట్నం మండలంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని పేర్కొన్నారు.

==========

ఐదేళ్ల రాష్ట్ర ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని వైద్య శాఖ మంత్రి విడదల రజనీ అన్నారు. ఈరోజు బాపట్ల జిల్లా మేదరమెట్లలో వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపు నిర్వహిస్తున్న బహిరంగ సభ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ సభలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పాల్గొని ఐదేళ్ల పాలన ప్రగతిని ప్రజలకు వివరిస్తారని తెలిపారు. అలాగే సభా వేదిక నుంచి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని వివరించారు.

==========